చెరువు ఆక్రమణకు స్కెచ్

- చెరువులో రోడ్డు వేసేందుకు పావులు
- తీర్మానం కోసం అజెండాలో చేర్చడంపై విమర్శలు
- నేటి బోర్డు సమావేశంలో తీర్మానానికి ఒత్తిళ్లు


ఎనికేపాడు పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న చెరువు


చెరువు స్థలం ఆక్రమించి రోడ్డు వేయాలనుకుంటున్న ప్రాంతం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న చెరువు స్థలాన్ని ఆక్రమించాలని టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. వాల్టా చట్టాన్ని, సుప్రీం కోర్టు ఆదేశాలను తుంగలో తొక్కి చెరువులో నుంచి రహదారి నిర్మించాలన్న అంశాన్ని తెర మీదకు తీసుకొచ్చి దానికి అనుగుణంగా పావులు కదుపుతున్నారు. పంచాయతీ కార్యాలయం వెనుక సర్వే నంబరు 190/1లో సుమారు 2.26 ఎకరాల విస్తీర్ణం గల కుంటగా పిలవబడే చెరువు ఉంది. దీనిపై కన్ను పడిన గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వారి స్వార్థ ప్రయోజనాలకు అనుకూలంగా మార్చుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే చెరువులో కొన్నేళ్ల క్రితం వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కుతూ రైతుల ప్రయోజనార్థమంటూ అప్పటి కలెక్టర్‌ను మభ్యపెట్టి రాత్రికి రాత్రి చెరువులో రోడ్డు నిర్మించారు. ప్రస్తుతం ఈ రోడ్డుకు కొనసాగింపుగా రోడ్డు వెడల్పు పెంచేందుకు పంచాయతీ తీర్మానం కోసం అజెండాలో చేర్చడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 25వ తేదీ శుక్రవారం జరగనున్న పంచాయతీ బోర్డు సమావేశంలో మెజార్టీ పాలకవర్గ సభ్యుల తీర్మానం కోసం టీడీపీ నాయకులు ఒత్తిడి తీసుకొస్తున్నారు.

అధికారులను తప్పు దోవ పట్టిస్తున్నారు..

చెరువులో రహదారి నిర్మాణమైతే తమ పొలాలకు రెట్టింపు ధరలు పెంచుకునే ఉద్దేశంతో మండల, జిల్లా అధికారులను టీడీపీ నాయకులు తప్పు దోవ పట్టిస్తున్నారు. జాతీయ రహదారికి అతి సమీపంలో ఉన్న ఈ చెరువు వద్ద భూముల ధరలు ఇప్పటికే ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ చెరువు వెనుక ఉన్న పొలాల ధరలు పెంచుకునేందుకు, కమర్షియల్ నిర్మాణాలు సాగించేందుకు టీడీపీ నాయకులు ఎప్పటి నుంచో చెరువు ఆక్రమణకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. చెరువుకు సమీపంలోనే ఓ కార్పొరేట్ కళాశాల నిర్మాణం కూడా చేయనున్నారు. ఈ నేపథ్యంలో సొంత పొలాలు కలిగి ఉన్న టీడీపీ నాయకులు జట్టుగా ఏర్పడి రహదారి అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు.

పైకి మాత్రం 20 అడుగులు సొంత పొలాలు ఇస్తాం, మరో 20 అడుగులు చెరువు స్థలం కేటాయించాలని పట్టు పడుతున్నారు. వాస్తవంగా ఇప్పటికే చెరువు స్థలంలో 20 అడుగులకు పైగా ఆక్రమించి గతంలోనే రోడ్డు నిర్మించేశారు. ఈ చెరువు సమీపంలోని పొలాల్లో పంటలు కూడా పండించడం లేదు. కమర్షియల్ నిర్మాణాలు సాగించేందుకు చదును చేసి ఇప్పటికే సిద్ధంగా ఉంచారు. దీంతో చెరువులో రహదారి నిర్మాణ అంశం గ్రామంలో పొక్కడంతో తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహించుకునేందుకు, తమ పొలాలకు విలువ పెంచుకునేందుకు చెరువును ఆక్రమించడమేంటని ప్రశ్నిస్తున్నారు.

అప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్.. ఇప్పుడు రహదారి

చెరువు ఆక్రమణ ప్రయత్నాల్లో భాగంగా ఇటీవల స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణమంటూ టీడీపీ నాయకులు పెద్ద స్థాయిలోనే ప్రయత్నాలు చేశారు. చెరువు ఆక్రమణకు జరుగుతున్న ప్రయత్నాలపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించింది. దీంతో జిల్లా అధికారులకు, గ్రామస్తులకు విషయం తెలియడంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఇతర ప్రభుత్వ స్థలంలో నిర్మించుకోవాలని, చెరువు స్థలంలో వద్దంటూ తీవ్రంగా వ్యతిరేకించారు. బోర్డు సమావేశంలో కూడా పాలకవర్గ సభ్యులు వ్యతిరేకించడంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణ ఆలోచనను విరమించుకున్నారు. ఇది జరిగి మూడు మాసాలు గడవక ముందే మరల చెరువులో రహదారి నిర్మాణమంటూ ఆక్రమణకు తెర లేపారు.

ఎమ్మెల్యే ప్రకటనలు మాటలకే పరిమితమా..

గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తాజాగా జరిగిన ఓ కార్యక్రమంలో ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఎంతటివారినైనా వదలిపెట్టనని ప్రకటించారు. నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు ఆక్రమించినా, కబ్జాలు చేసిన చూస్తూ ఊరుకోనని ఆక్రమదారులు, అధికారులను ఉద్దేశిస్తూ హెచ్చరించారు. ఎనికేపాడులో మాత్రం ఎమ్మెల్యే ఆదేశాలను ఏ మాత్రం పట్టించుకోకుండా ఏకంగా చెరువు స్థలాన్ని ఆక్రమించడానికి టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. అధికారులను గుప్పెట్లో పెట్టుకుని బోర్డు సమావేశంలో కూడా చెరువులో రోడ్డు వేసే అంశాన్ని అజెండాలో చేర్చారు. శుక్రవారం జరగనున్న బోర్డు సమావేశంలో ఈ అంశం తీర్మానం పొందడానికి శత విధాలా ప్రయత్నిస్తున్నారు. దీంతో చెరువు స్థలం ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్న టీడీపీ నాయకులపై చర్యలు తీసుకుంటారా లేక చూస్తూ ఊరుకుంటారా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం..



ఇటీవల చెరువు స్థలంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణమంటూ టీడీపీ నాయకులు హడావుడి చేశారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు సమావేశంలో వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గారు. ప్రస్తుతం చెరువులో నుంచి రహదారి నిర్మాణమంటూ ఆక్రమణకు తెరలేపారు. తమ పొలాలకు ధరలు పెంచుకోవడానికి చెరువు స్థలం ఆక్రమణకు పావులు కదుపుతున్నారు. వాల్టా చట్టానికి వ్యతిరేకంగా రహదారి ఎలా నిర్మిస్తారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం. చెరువు స్థలం అన్యాక్రాంతం కాకుండా అధికారులు కాపాడాల్సిన అవసరం ఉంది.

– మాదు సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు

మంతెన, జగన్నాథపురంలో రీ సర్వే ప్రారంభం

కంకిపాడు: మంతెన, జగన్నాథపురం గ్రామాల్లో భూముల రీ సర్వే ప్రక్రియ గురువారం చేపట్టారు. సర్వే బృందాలు ఆయా గ్రామాల పరిధిలోని భూముల రీ సర్వే నిర్వహిస్తున్నారు. సర్వేను తహసీల్దార్ వి.భావనారాయణ పరిశీలించారు. జూన్ 20వ తేదీతో సర్వే ముగుస్తుందన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన దస్తావేజులతో సర్వే బృందాన్ని కలిసి వివరాలు తెలియజేయాలన్నారు. సర్వే ప్రక్రియకు సహకరించాలని కోరారు.

కానూరుకు యూపీహెచ్‌సీ మంజూరు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ కానూరుకు ప్రభుత్వం అర్బన్ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ) మంజూరు చేస్తూ ఉత్తర్వులు(జీవో 235)జారీ చేసింది. కమిషనర్ ఆఫ్ హెల్త్, నేషనల్ హెల్త్ మిషన్ అధికారులు (ఎన్‌హెచ్‌ఎం) సమీక్షించిన తరువాత కానూరులో యూపీహెచ్‌సీ ఏర్పాటుకు ఉత్తర్వులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. పటమట యూపీహెచ్‌సీకి మంజూరు చేసిన 15 ఆర్థిక సంఘ నిధులు కానూరు యూపీహెచ్‌సీ భవన నిర్మాణానికి వినియోగించాలని ఆదేశాలు జారీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం గ్రామంలోని పటేల్‌నగర్, సాయి నగర్, హనుమాన్‌నగర్, టెంపుల్ ఏరియా, ఫ్లై ఓవర్ దిగువ ప్రాంతం, రైల్వేస్టేషన్ కట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

పెనమలూరులో మజ్జిగ పంపిణీ



పెనమలూరు: పెనమలూరు గ్రామంలో శ్రీసత్యసాయిబాబా సేవా సమితి గురువారం ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేసింది. భగవాన్ శ్రీసత్యసాయిబాబా ఆరాధన ఉత్సవాన్ని పురస్కరించుకొని కమిటీ ఈ కార్యక్రమం చేపట్టింది. కమిటీ కన్వీనర్ మోహన్‌రావు మాట్లాడుతూ.. సత్యసాయిబాబా చూపిన ప్రేమ, కరుణ ప్రతి ఒక్కరికి కలగాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు ఉయ్యూరు రమణమ్మ, ఎల్.వెంకటలక్ష్మి, రమాకుమారి, కిశోర్, సాయిలీల, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

పోరంకిలో సామూహిక సీమంతాలు



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పోరంకి గ్రామంలో అనుమోలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీమంతాల కార్యక్రమం చేశారు. గ్రామంలోని ద్వారకా రెసిడెన్సీలో గర్భిణులకు సామూహిక సీమంతాలు గురువారం నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గర్భిణులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవటం వలన ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో బోడె హేమా చౌదరి, అనుమోలు లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు అభినందన



పెనమలూరు: జేఎన్‌టీయుకే సాఫ్ట్‌బాల్ జట్టుకు వీఆర్ సిద్ధార్థ డీమ్డ్ టుబీ యూనివర్సిటీకి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు కాలేజీలో గురువారం జరిగిన కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ఎస్.వెంకటేశ్వరరావు జట్టుకు ఎంపికైన విద్యార్థులు కె.నరసింహ, జే.జేమ్స్, ఎం.అంజెస్‌కుమార్‌లను అభినందించారు. మే 4వ తేదీ నుంచి నెల్లూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో జరగనున్న ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో జేఎన్‌టీయుకే జట్టు నుంచి పాల్గొంటారు. కార్యక్రమంలో ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ రఘు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద నిరోధకాలపై అవగాహన

పటమట(విజయవాడతూర్పు): అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు అక్కడ ప్రజలు కూడా అప్రమత్తతతో ఉండాలని, సిబ్బందికి పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా అగ్నిమాపక అధికారి మాల్యాద్రి అన్నారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలతో గురువారం ఆయా షాపింగ్ కాంప్లెక్స్‌లలో అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం కాంధారి హోటల్ రోడ్డులోని ఆహా షాపింగ్ మాల్, మొగల్రాజపురంలోని రస్టెడ్ స్పూన్ రెస్టారెంట్, ఎంజీరోడ్డులోని పీవీపీ మాల్ ఎదురుగా ఉన్న చెన్నుపాటి పెట్రోల్ బంక్‌లలో వీఎంసీ అగ్నిమాపక సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించి స్థానికంగా ఉన్న అగ్నిమాపక నిరోధక పరికరాలను పరిశీలించారు. అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా, ఎన్టీఆర్ కాంప్లెక్స్ వ్యాపారస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

బతుకులు రోడ్డున పడేశారంటూ ఆందోళన

గన్నవరంలో ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత


కూల్చివేతను అడ్డుకుంటున్న శివ కుటుంబ సభ్యులు

గన్నవరం: ఎన్నో ఏళ్లుగా రోడ్డు పక్కన కూరగాయలు, పండ్లు, పూలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాం.. 20 రోజుల క్రితం రోడ్డు విస్తరణ కోసం ఖాళీ చేయాలని, ప్రత్యామ్నాయం చూపిస్తామని అధికారులు హామీ ఇచ్చి.. ఇప్పుడు బుల్డోజరుతో దుకాణాలను కూలదోసి మా బతుకులను రోడ్డున పడేశారంటూ చిరువ్యాపారులు ఆందోళనకు దిగిన సంఘటన స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో గురువారం చోటుచేసుకుంది. ప్రత్యామ్నాయం చూపకుండా షాపులు కూల్చివేయడాన్ని పలువురు వ్యాపారులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఆక్రమణలు తొలగింపు వివాదాస్పదమైంది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక గన్నవరం – ఆగిరిపల్లి ఆర్‌అండ్‌బీ రహదారిపై ఆక్రమణల తొలగింపు పనులను గురువారం తెల్లవారుజామున ఆర్‌అండ్‌బీ, గ్రామ పంచాయతీ అధికారులు చేపట్టారు. భారీ పోలీస్ భద్రత మధ్య జేసీబీతో గతంలో సర్వే నిర్వహించి నిర్ధారించిన హద్దుల వరకు ఆక్రమణలను కూల్చివేశారు.

ముందస్తు సమాచారం ఇవ్వకుండానే..

తొలుత గాంధీ విగ్రహం చుట్టూ ఉన్న కూరగాయలు, పండ్లు, పూలు, టీ కొట్లను తొలగించారు. అయితే ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆక్రమణలు తొలగించడంతో అధికారులతో పలువురు వ్యాపారులు వాగ్వివాదానికి దిగారు. ప్రత్యామ్నాయం చూపకుండా షాపులు కూల్చివేతకు దిగడంపై పండ్ల వ్యాపారి శివ ఆందోళనకు దిగాడు. తన షాపు ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి బైఠాయించిన అతను కూల్చివేత పనులను అడ్డుకున్నారు. తొలుత అధికారులు నచ్చచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ శివ కుటుంబ సభ్యులు వినకపోవడంతో పోలీసులు బలవంతంగా పక్కకు లాగివేశారు. అనంతరం సదరు షాపును జేసీబీతో కూల్చివేయడంతో శివ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ఒక్కసారిగా దుకాణాలను తొలగించడంతో కూరగాయలు, పండ్లు, పూల వ్యాపారులు ఆర్థికంగా నష్టపోవాల్సి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు వ్యాపారులు స్వచ్ఛందంగానే ఆక్రమణలను తొలగించుకున్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగిస్తున్నట్లుగా అధికారులు స్పష్టం చేశారు. మరో రెండు రోజుల పాటు ఆక్రమణల తొలగింపు పనులు కొనసాగుతాయని తెలిపారు.

ఆడ పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు


కానూరులో మాట్లాడుతున్న ఏసీపీ లతాకుమారి

పెనమలూరు: ఆడ పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మహిళా పీఎస్ ఏసీపీ కె.లతాకుమారి హెచ్చరించారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం ఆడ పిల్లలపై లైంగిక వేధింపులు అనే అంశంపై అవగాహన సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఆడ పిల్లలపై లైంగిక వేధింపులు జరిగితే అది వారి చదువుపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఆత్మవిశ్వాసం కోల్పోవటం, మానసిక ఒత్తిడి, డిప్రెషన్‌కు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ఆడపిల్లల రక్షణకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. బాధితులు సమస్యను తమ దృష్టికి తీసుకు వస్తే వెంటనే చర్యలు తీసుకొని రక్షణ కల్పిస్తామన్నారు. ఆడ పిల్లలు ఎదుర్కొనే సమస్యలు వెంటనే తమ తల్లిదండ్రుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, ఉమెన్స్ సెల్ చైర్‌పర్సన్ పి.ఆదిలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రాణ రక్షణ కల్పించాలని వినతి


గోడు వెళ్లబోసుకుంటున్న రాజేష్

కంకిపాడు: తనపై జరిగిన దాడి రాజకీయ పరమైన దాడి అని, కేసును పక్కదారి పట్టించే యత్నం జరుగుతోందని బాధితుడు పి.రాజేష్ వాపోయాడు. ఈ మేరకు సోషల్ మీడియాలో బాధితుడి వీడియో వైరల్ అవుతోంది. బాధితుడు రాజేష్ గురువారం విలేకరులతో మాట్లాడాడు. పోరంకికి చెందిన తాను ఆటో కిరాయికి తీసుకుని నడుపుతుంటానన్నాడు. ఈనెల 21న పోరంకి పంచాయతీ ఆఫీసు వద్ద ఆటోను ముగ్గురు వ్యక్తులు ఆపి ఈడుపుగల్లు కిరాయికి తీసుకొచ్చారన్నాడు. ఈడుపుగల్లులోని గురుకుల పాఠశాల వెనుక ఫ్లాట్స్‌లోకి తీసుకెళ్లారని, కిరాయి అడగ్గా గుర్తుతెలియని ఆ ముగ్గురు వ్యక్తులు కర్రలతో విచక్షణారహితంగా తనను కొట్టారని వాపోయాడు. ఎందుకు కొడుతున్నారని ప్రశ్నిస్తే తమకు తెలిసిన అమ్మాయిని ఏడిపించినందుకు కొడుతున్నామని చెప్పారని, అయితే ఆ ముగ్గురు వ్యక్తులు ఎవరో కూడా తనకు తెలీదని వాపోయాడు. అమ్మాయి తరఫు బంధువులు కొట్టారంటూ కేసును మార్చారని, తాను ఇచ్చిన ఫిర్యాదు కాపీని పక్కన పెట్టారని వాపోయాడు. దాడికి కారణమైన ముగ్గురు వ్యక్తులను పిలిచి విచారణ చేస్తే రాజకీయ పరమైన దాడితో సంబంధం వెలుగు చూస్తుందన్నారు. తాను వైఎస్సార్ సీపీ కార్యకర్త కావటం కారణమన్నాడు. దాడిలో చంటి, మహేష్‌లు ప్రధాన పాత్రధారులని, తనకు ప్రాణ రక్షణ కల్పించేందుకు అధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరాడు.

15 నుంచి వేణుగోపాలస్వామి ఆలయ కుంభాభిషేకం


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఈఓ హేమలతాదేవి, అర్చకులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామి వార్ల దేవస్థానం మహాసంప్రోక్షణ(కుంభాభిషేకం)కార్యక్రమాలు మే 15 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాణాధికారి ఎస్.హేమలతా దేవి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో గురువారం ఆమె అర్చకులతో కలిసి సంప్రోక్షణ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. 500 ఏళ్లకు పైగా వారసత్వాన్ని కలిగిన ఈ పురాతన ఆలయం నూజివీడు జమిందార్లు నిర్మించారన్నారు. దేవదాయ, ధర్మదాయ శాఖ సౌజన్యంతో గ్రామస్తులు, భక్తుల సహాయ సహకారాలతో కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానం పర్యవేక్షణలోని ధర్మగిరి వేద పాఠశాలకు చెందిన శ్రీమాన్ మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు మార్గనిర్దేశం చేస్తూ ఈ వేడుకలు నిర్వహిస్తారన్నారు. ముగింపు రోజు శ్రీరుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి వారి దివ్య శాంతి కల్యాణోత్సవం జరుగుతుందని చెప్పారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహిస్తామని, భక్తులు పాల్గొనాలని కోరారు. ప్రముఖ పండితుడు రొంపిచర్ల శేషాచార్యులు, రొంపిచర్ల రాము, జ్యోతిష్య పండితుడు డాక్టర్ మామిళ్లపల్లి ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్లకు అభినందన



హనుమాన్‌జంక్షన్‌రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులను బాపులపాడు ఎంఈవో శ్రీరామ్ బాలాసింగ్ అభినందించారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని వాణి విద్యానికేతన్‌కు చెందిన విద్యార్థిని షేక్ జలీలా 590 మార్కులతో మండల ఫస్ట్ సాధించగా, మరో విద్యార్థిని జి.శ్రావ్యశ్రీ 589 మార్కులతో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ విద్యార్థులతో పాటుగా పాఠశాల కరస్పాండెంట్ నందిగం రవికుమార్ గురువారం ఎంఈవోను కలిశారు. ఇద్దరు విద్యార్థులకు ఆయన పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లోనూ ఉన్నత విద్యలో ఉత్తమ ప్రతిభ కనపర్చాలని ఎంఈవో శ్రీరామ్ బాలాసింగ్ ఆకాంక్షించారు. విద్యార్థులను, పాఠశాల కరస్పాండెంట్ రవికుమార్, ఉపాధ్యాయులను ఎంఈవో అభినందించారు.

పెనమలూరులో 80 వితంతు పింఛన్ల మంజూరు

పెనమలూరు: పెనమలూరు మండలంలో 80 వితంతు పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ బండి ప్రణవి తెలిపారు. ఆమె గురువారం వివరాలు తెలుపుతూ ప్రభుత్వం డిసెంబర్ 2023 నుంచి అక్టోబర్ 2024వ సంవత్సరం వరకు వితంతు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పింఛన్లు మంజూరు చేసిందన్నారు. మరిన్ని వివరాలకు దరఖాస్తుదారులు ఆయా సచివాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

పంచాయతీరాజ్ వ్యవస్థతో గ్రామాల్లో అభివృద్ధి


అధికారులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న జెడ్పీటీసీ సువర్ణరాజు

విజయవాడరూరల్: పంచాయతీరాజ్ వ్యవస్థతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని జెడ్పీటీసీ కె.సువర్ణరాజు అన్నారు. విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ సువర్ణరాజు మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ వ్యవస్థ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అమలులో ఉందన్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీ వలన గ్రామ స్థాయిలో ప్రజలకు సుభిక్ష పరిపాలన అందుతుందని చెప్పారు. ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించి వాటిని పరిష్కరించే దిశగా పనిచేయడం, మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయడం వలన ప్రజలకు మంచి పరిపాలన అందించగలమని చెప్పారు. అధికారులకు జెడ్పీటీసీ ప్రశంసాపత్రాలను అందచేశారు. వారు చేస్తున్న సేవలను కొనియాడారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.మురళీకృష్ణప్రసాద్, డెప్యూటీ ఎంపీడీఓ మన్నె వెంకటదుర్గా ప్రసాద్, కోఆప్షన్ సభ్యులు అల్తాఫ్, పైడూరుపాడు గ్రామ సర్పంచ్ వేమూరి సీతారామయ్య, అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి టిగ్వాన్ ఆర్ - లైన్ కారు


కారును ఆవిష్కరిస్తున్న పాములపాటి రాజేష్

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎల్‌ఎం ఆటో కార్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఫోక్స్ వేగన్ షోరూమ్‌లో గురువారం సరికొత్త టిగ్వాన్ ఆర్- లైన్ కారును ఎస్బీఐ ఏజీఎం పి.విజయ్‌కుమార్, షోరూమ్ అధినేత పాములపాటి రాజేష్ నగర మార్కెట్‌లోకి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఈ కారు 2.0 లీటర్ల టీఎస్ఐ టర్బో చార్జ్‌డ్ ఇంజిన్, 7 స్పీడ్ డీఎస్ఐ ఎలక్ట్రిక్ వైర్ ట్రాన్స్‌మిషన్‌తో రూపొందించారన్నారు. లెవల్ 2 అడాస్, 4 మోషన్ ఆల్ వీల్ డ్రైవ్ టెక్నాలజీ, వాయిస్ కమాండ్‌తో పని చేసే 15 అంగులాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, 19 అంగుళాల అలాయ్ వీల్స్, 9 ఎయిర్ బ్యాగ్స్ వంటి అత్యాధునిక సౌకర్యాలను కారులో ఇనుమడింపజేశారని చెప్పారు. 6 ఆకర్షణీయమైన రంగుల్లో కారు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో షోరూమ్ సేల్స్ టీమ్, ఫైనాన్షియర్లు, వినియోగదారులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పాటుపడాలి

ఉంగుటూరు(గన్నవరం): మండల కేంద్రమైన ఉంగుటూరు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను ఎంపీపీ వడ్లమూడి సరోజిని సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ వ్యవస్థలోని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్న పారిశుద్ధ్య కార్మికులకు సముచిత గౌరవం ఇవ్వాలన్నారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

27న గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ సదస్సు

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి. విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 27వ తేదీ ఉదయం 9.30 నుంచి రాత్రి 7 గంటల వరకు ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం బాధ్యురాలు కె.స్వరూపరాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాసంస్థలు-గ్రంథాలయాలు, సాంకేతిక యుగం-పుస్తక పఠనావశ్యకత, పౌర గ్రంథాలయాలు-సమస్యలు-పునర్నిర్మాణం, పౌర గ్రంథాలయాలు-సాహిత్యం -ప్రాధాన్యత అనే అంశాలపై నాలుగు విభాగాలుగా సదస్సు జరుగుతుందన్నారు.

మాతృభాషను పరిరక్షించాలి..

మరుగున పడుతున్న మాతృభాషను పరిరక్షించాలని, విద్యార్థులకు, పరిశోధకులకు, ప్రజలకు సమాచార వనరులను అందించాలని, గ్రంథాలయ నాణ్యతా పని తీరును మెరుగుపరిచి ఉద్యోగ నియామకాలు జరపాలని, ప్రజల నుంచి వసూలు చేసిన గ్రంథాలయ సెస్సును గ్రంథాలయ అభివృద్ధికి ఉపయోగించాలని కోరుతూ ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రం, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితలు, కవులు, ప్రచురణకర్తలు, ఉపాధ్యాయులు, కళాకారులు, మేధావుల సంయుక్త ఆధ్వర్యంలో జరిగే సదస్సులో విజ్ఞాన కేంద్రాల బాధ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

- **ఆటోనగర్(విజయవాడతూర్పు):** పేద మహిళలకు ఆర్థికంగా చేయూత ఇవ్వడం వలన అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతారని మెస్సీయ ఫెలోషిప్ పాస్టర్ డాక్టర్ సజ్జా రత్నకుమార్ అన్నారు. స్థానిక ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని మెస్సీయ ఫెలోషిప్ చర్చి ఆవరణలో కుట్టుమిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 50 మంది మహిళలకు గురువారం ఆయన సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు.